క్లుప్తంగా

నేడు ఎంపీపీగా ధనలక్ష్మి బాధ్యతల స్వీకరణ

యలమంచిలి: ఇటీవల హైకోర్టు ప్రమేయంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన యలమంచిలి ఎంపీపీ ఎన్నికలో నూతన అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఇనుకొండ ధనలక్ష్మీ రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

న్యూక్లాత్ మార్కెట్ డ్రెయిన్‌లో సిల్ట్ తొలగింపు



సిల్ట్ తొలగింపు పనులు పరిశీలిస్తున్న కమిషనర్ విజయసారథి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక న్యూక్లాత్ మార్కెట్‌లోని డ్రెయిన్‌లో మంగళవారం సిల్ట్ తొలగింపు పనులను ప్రారంభించారు. ఈ పనులను మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ ప్రాంతంలోని షాపుల యజమానులు వారి ఇష్టానుసారం పార్కింగ్ టైల్స్ డ్రెయినేజీపై ఏర్పాటు చేసి పార్కింగ్‌కు ఉపయోగించుకుంటున్నారు. వాటిని తొలగించి సిల్ట్ తొలగింపు పనులు చేస్తున్నారు. కార్యక్రమంలో కొరగంజల రవి, శిడగం సతీష్, బేరం శ్రీరామచంద్రమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం



మావుళ్లమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు వేద పండితులు మంగళవారం చండి హోమం నిర్వహించారు .45 మంది దంపతులు ఈ హోమం లో పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆకివీడులో మున్సిపల్ ఆర్‌డీ పర్యటన



మురుగు తొలగింపును పరిశీలిస్తున్న మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగ నర్సింహరావు

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగ నర్సింహరావు సందర్శించారు. కార్యాలయంలో ఆయా శాఖల పని తీరు, కార్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం పట్టణంలో మురుగు డ్రెయిన్లలో పూడికతీత పనుల్ని పరిశీలించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(ఆసుపత్రి)వద్ద ఏర్పాటు చేసిన పార్కును పరిశీలించారు. ఆయన వెంట నగర పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన లలిత కళల శిక్షణ



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత, భావ వ్యక్తీకరణను పెంపొందించేందుకు లలిత కళలు ఎంతగానో ద్రోహదం చేస్తాయని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మంగళవారం భీమవరం పట్టణం ఏఎస్‌ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో 25 రోజులపాటు నిర్వహించిన ఉచిత లలిత కళల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సాంస్కృతిక కేంద్రం సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, చెరుకువాడ సుబ్రహ్మణ్యంరాజు, వేగేశ్న రమణరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, ఎంఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బొండాడలో ఎక్సైజ్ దాడులు

కాళ్ల: ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారంగా మద్యం అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని బొండాడ గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. అనధికారంగా మద్యం అమ్ముతున్న ఈది ప్రసన్న కుమార్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద 5 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆకివీడు ఎక్సైజ్ ఎస్సై వి.కరుణప్రియ తెలిపారు.

దూడల సంరక్షణలో జాగ్రత్తలు తప్పనిసరి

పుట్టిన దూడలకు
ముర్రుపాలు పట్టించాలని వైద్యుల సూచన

పాలకొల్లు సెంట్రల్: రైతులు పాలిచ్చే పశువులను ఎంత శ్రద్ధగా చూసుకుంటారో వాటి దూడలను కూడా అంతే శ్రద్ధగా చూసుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు. దూడలకు బలమైన ఆహారం ఇస్తే అవి కూడా శ్రేష్టమైన పశువులుగా తయారవుతాయని చెబుతున్నారు. పాలిచ్చే పశువుల నుంచి మొత్తం పాలు పితికేస్తే దూడలకు సరైన పోషకాలు అందక వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుందని హెచ్చరిస్తున్నారు. పుట్టిన ప్రతి దూడనూ ఆరు నెలల లోపు పరిశర ప్రాంతాల్లో ఉన్న పశు వైద్యశాలలో చూపించి తగిన సలహాలు సూచనలు పాటించాలని పేర్కొంటున్నారు. అలాగే వైద్యాధికారులను సంప్రదించి చెవి పోగు వేయించి రిజిస్టర్ చేయించుకోవాలని స్పష్టం చేస్తున్నారు. పుట్టిన దూడలకు మొదటి వారం రోజులు తల్లి నుంచి రెండు పూటలా మురుపాలు పట్టించాలి.ఈ మురుపాలను దూడ పుట్టిన 8 నుంచి 12 గంటల లోపు పట్టించాలి. ఇలా పట్టించడం వల్ల వాటిలో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో వ్యాధులు నుండి సంరక్షించుకోవచ్చు. రైతులు వ్యాపార కోణంలో ఆలోచించకుండా పశువుల పొదుగు నుండి మొత్తం పాలను తీయకుండా దూడలకు కొంత భాగం వదిలివేయాలి. అలా దూడలకు పాలు వదలకుండా నిర్లక్ష్యంగా మొత్తం పాలు తీసేస్తే అవి నీరసించిపోతాయి. సాధారణంగా మొదటి మూడు నెలల్లో దూడ బరువు 30 కేజీలు ఉంటుంది. కాబట్టి పది శాతం పాలు దూడకు వదలాల్సిన అవసరం ఉంటుంది. రోజుకు ఉదయం, సాయంత్రం కలిపి మూడు లీటర్లు పాలు దూడకు వదలడం వల్ల ఎంతో ఆరోగ్యవంతంగా ఉంటాయి. మూడు నాలుగు నెలల అనంతరం దూడలు పచ్చగడ్డి, ఇతర దాణాలకు అలవాటు పడుతున్న అనంతరం పాలకు దూరం చేయవచ్చు.



దూడకు చికిత్స చేస్తున్న పశు వైద్యులు



దూడకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



దూడలు పుట్టిన వెంటనే మొదటిరోజు ధనుర్వాతం ఇంజక్షన్ చేయించాలి. నాలుగో రోజు ప్రిపలిస్ ఇంజక్షన్, విటమిన్ ఏ వేయించాలి. నాలుగో నెలలో సంకరజాతి దూడలకు థైలేరియా వ్యాధి నిరోధక టీకా ఇప్పించాలి. ఆరో నెలలో గొంతు వాపు, జబ్బ లాపు టీకాలు, పెయ్యి దూడలకు 4 నుంచి 8 నెలల లోపు బ్రూసెల్లోసిస్ టీకా, ప్రతీ ఆరు నెలలకు గాళ్ల వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పాడి రైతులు తమకు సమీపంలో ఉన్న పశు వైద్యశాలలో సంప్రదించి వైద్యుల సలహాలు, సూచనల మేరకు తమ దూడలకు చికిత్స చేయించాలి.

– డాక్టర్ జి మల్లేశ్వరరావు, సహాయ సంచాలకుడు, ప్రాంతీయ పశువైద్యశాల, పాలకొల్లు

తెల్లపారుడు

దూడలు ఒక్కోసారి తెల్లగా పారుతుంటాయి. దీనిని తెల్లపారుడు అంటారు. కొన్ని రకాల బ్యాక్టీరియాలతో లేగ దూడలకు ఈ వ్యాధి సోకుతుంది. తెల్లపారుడుకు ముందు దూడలకు జ్వరం రావడం , ఆకలి మందగించడం, చర్మం పొడిగా, గరుకుగా ఉంటుంది. దూడలో బలం లేక నీరశించిపోతుంది. ఆ సమయంలో వైద్యుల సలహాతో సల్ఫా యాంటిబయాటిక్స్, ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వాల్సి ఉంటుంది.

రక్త విరేచనాలు

దూడలకు ఎక్కువ పాలు తాగించడం వల్ల కోక్సిడియా వ్యాపించి రక్త విరేచనాల వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకిన దూడల్లో పేడ రక్తంతో కలిసి వస్తుంటుంది. పశువులను శుభ్రంగా ఉంచడంతో పాటు సరైన జాగ్రత్తలు పాటించాలి. దీనికి సల్ఫా, ఏంప్రోలియం యాంటిబయాటిక్స్‌ను వాడుతూ డీహైడ్రేషన్ రాకుండా ఐవీ ఫ్లూయిడ్స్ వాడాలి.

అంతర పరాన్నజీవులు

అనేక రకాల పురుగులు జీర్ణాశయాన్ని, ఊపిరితిత్తులను సోకడంతో దూడలు నీరసిస్తాయి. దీనిపై అశ్రద్ధ చేస్తే దూడలు మరణించే అవకాశాలు ఉంటాయి. ఈ పురుగులు పేడ, నేల, నీటి ద్వారా సోకుతుంటాయి. ఆ సమయంలో దూడలకు ఏలిక పాముల మందులను వాడిలి. వీటిని 7, 15, 30, 60, 90 రోజులలో వాడాలి. అనంతరం ప్రతి మూడు నెలలకు ఒకసారి సంవత్సరం పాటు వేయించాలి. తదుపరి ఏ పశువుకైనా ప్రతి ఆరు నెలలకు పాముల మందు వేస్తే దూడలు ఆరోగ్యంగా ఉంటాయి.

దూడలకు సోకే వ్యాధులు

పశువుల పాకలో పరిశుభ్రత పాటించాలి. అపరిశుభ్రత వల్ల పాకలో బురద చేరడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుంది. అవి తినే పాత్రలు, షెడ్లలో నీరు నిల్వ ఉండడం, బురదగా ఉండడం, పరిమితికి మించి ఆహారాన్ని అందించడం వల్ల దూడలకు అతిసార వ్యాధి సోకే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధి వల్ల నీళ్ల విరోచనాలు అవుతాయి. దానితో దూడలు బరువు తగ్గిపోయి నీరసించిపోతాయి. ఆ సమయంలో పశువైద్యుని సలహాలు పాటించాలి. సల్ఫా, యాంటిబయాటిక్స్, ఐవీ ఫ్ల్యూయిడ్స్ ఇచ్చి డీ–హైడ్రేషన్ రాకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు పశువుల శాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమతెరలు ఉపయోగించి వాటిని సంరక్షించేలా ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలి.

హరిబాబు, హరికృష్ణలకు ఎన్టీఆర్ అవార్డులు



ఎన్టీఆర్ అవార్డు అందుకుంటున్న హరిబాబు, హరికృష్ణ

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన కళాకారులు, రంగస్థలనటులు, సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు గుడాల హరిబాబు, సింగర్, స్టేజీ ఆర్టిస్ట్, మ్యుజీషియన్ అయిన వడ్లమాని హరికృష్ణలకు ఎన్టీఆర్ అవార్డు దక్కింది. మంగళవారం అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ ఈ నెల 25న హైదరాబాద్ కూకట్‌పల్లి సూర్యచంద్ర కల్చరల్, సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఎక్సలెన్స్ అవార్డులు అందించినట్లు తెలిపారు. తమ కళలను, సేవలను గుర్తించి ఎన్టీఆర్ అవార్డు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. హరిబాబు, హరికృష్ణలకు పట్టణ కళాపరిషత్, రసదుని, హరివిల్లు, నటీనట సంక్షేమ సమాఖ్య, సంస్కార భారతి, రోటరీక్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, కళాకారులు అభినందనలు తెలియజేశారు.

రేపు నరసాపురం కౌన్సిల్ సాధారణ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంటరమణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యను చర్చిస్తామని స్పష్టం చేశారు. సభ్యులు విధిగా సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

గోదావరి ఒడ్డున యోగా సందడి

నరసాపురం: అంతర్జాతీయ యోగా దినోత్సవాలను పురస్కరింకుని మంగళవారం నరసాపురం వశిష్ట గోదావరి వలంధర్‌రేవు వద్ద యోగాంధ్ర కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. దీంతో గోదావరి తీరంలో యోగా సందడి నెలకొంది. వలంధర్‌రేవు ఆవరణలో సుమారు వెయ్యి మంది యోగాసనాలు వేశారు. ఇక గోదావరిలో పడవలపై చేసిన యోగాసనాలు కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల్లో యోగా దినోత్సవాలను నిర్వహించడం ద్వారా ప్రజల్లో మరింత స్ఫూర్తిని కలిగించేందుకు గోదావరి తీరంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నరసాపురం ఆర్డీవో దాసి రాజు, డీఎస్పీ డాక్టర్ జి.శ్రీవేద తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో యోగా ప్రదర్శన

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నెల రోజులు వేడుకల్లో భాగంగా మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్, టు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. యోగా ట్రైనర్ నారిన సూర్యకుమారి విద్యార్థులతో వజ్రాసనం, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం వంటి యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ, విడివి విజయలక్ష్మి, ఫిజికల్ ఎడ్యుకేటర్ బి.రమేష్ కుమార్, పి.శ్రీనివాసరావు, వి.శిరీష, కె.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో మంగళవారం పెనుమంట్ర, మార్టేరు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగ శిక్షణకార్యక్రమాలను ప్రారంభించినట్లు ఎంపీడీవో ఎమ్మెస్ ప్రభాకర్ రావు తెలిపారు. మార్టేరు వైపు ఉన్న తొమ్మిది గ్రామాలకు మార్టేరులోను, పెనుమంట్ర వైపు తొమ్మిది గ్రామాలకు పెనుమంట్ర లోను శిక్షణ కార్యక్రమాలను ట్రైనీలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. మార్టేరు జెడ్పీటసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిని, సర్పంచ్ మట్ట కుమారి రాము, ఉప సర్పంచ్ కర్రి వేణు బాబు, పెనుమంట్రలో గ్రామ సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక ప్రసన్న, ఉప సర్పంచ్ భూపతి రాజు శ్రీనివాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.



నరసాపురం: వశిష్ట గోదావరి ఒడ్డున యోగాసనాలు వేస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: ఏఎస్ఎన్ఎం కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



నరసాపురం: వలంధర్‌రేవులో పడవలపై యోగాసనాలు వేస్తున్న దృశ్యం

పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

నరసాపురం: పిల్లల పెంపకంలో తల్లితండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లీగల్ సర్వీసెస్ సభ్యుడు వై.దేవేంద్ర ఫణికర్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్‌క్యాంపులో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫణికర్ మాట్లాడుతూ దేశంలో ప్రతి ఏటా 96వేలమంది పిల్లలు తప్పిపోవడం, అపహరణకు గురవ్వుతున్నారని గణాంకాలు చెపుతున్నాయని అన్నారు. పిల్లలను బయటకు వెళ్లినప్పుడు ఒంటరిగా విడిచిపెట్టకూడదన్నారు. అలాగే సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలని సూచించారు. ముఖ్యంగా చిన్నప్పటి నుంచి కుటుంబ బాంధవ్యాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కేఎస్ఎల్ కుమారి, గ్రంథాలయ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వై.దేవేంద్ర ఫణికర్

విద్యార్థినికి ఆర్థిక సాయం

యలమంచిలి: పాలకొల్లు మండలం భగ్గేశ్వరం గ్రామానికి చెందిన మల్లుల దివ్య దీపిక ఉన్నత చదువుకు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ పీర్ సాహెబ్ ద్వారా ఆర్థిక చేయూత లభించింది. దివ్య లంకలకోడేరు హైస్కూల్ నుంచి ఈ సంవత్సరం 10వ తరగతిలో 567 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. డాక్టర్ కావాలనేది ఆమె కోరిక. తండ్రి ఆలన లేకపోవడం, తల్లి రెక్కల కష్టమే కుటుంబానికి ఆసరా కావడంతో ఆమెకు ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉంది. పాఠశాల ఉపాధ్యాయురాలి ద్వారా విషయం ఉపాధ్యాయుడు షేక్ పీర్ సాహెబ్ దృష్టికి రావడంతో ఆయన స్పందించి విషయాన్ని తన పూర్వ విద్యార్థికి చెప్పారు. ఆ విద్యార్థి తక్షణమే స్పందించి రూ.25 వేలు పంపించాడు. పాఠశాల ఉపాధ్యాయులు విద్య, మహేష్‌లు మరొక రూ.20 వేలు అందించారు. అలా వచ్చిన రూ.45 వేలను పీర్ సాహెబ్ మంగళవారం తల్లి, సోదరుని సమక్షంలో దివ్యకు అందజేశారు. పీర్ సాహెబ్ తన వంతు సహాయంగా ఒక కార్పొరేట్ కళాశాల యాజమాన్యంతో సంప్రదించి హాస్టల్‌లో ఉంటూ నీట్ ప్రోగ్రాంలో తక్కువ ఫీజుకే చేర్పించారు. పేద విద్యార్థిని కల సాకారం కావడానికి చేయూతను అందించిన దాతలకు, పీర్ సాహెబ్ మాస్టారుకి దివ్యతో పాటు తల్లి, సోదరుడు కృతజ్ఞతలు తెలిపారు.



దివ్య దీపికకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉపాధ్యాయుడు షేక్ పీర్ సాహెబ్

సైబర్, ఆన్‌లైన్ నేరాలపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏఎస్సై మార్‌లింగం అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిదిలో బ్రాడీపేట సచివాలయంలో కిషోర్ వికాసం 8వ సెషన్‌లో నేరాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్‌లింగం మాట్లాడుతూ ఎంత అవగాహన ఉన్నవారైనా సరే ఒక్కో సందర్భంలో ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారని అన్నారు. తెలియని నెంబర్ల నుండి ఫోన్లు వస్తుంటాయని సాధ్యమైనంత వరకూ వాటిని లిఫ్ట్ చేయకుండా ఉంటే మంచిదని అన్నారు. చిన్నారులు సెల్‌పోన్‌లో గేమ్స్ ఆడుతూ ఉండగా తెలియని లింక్‌లను ఓపెన్ చేయడం వల్ల కూడా అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ బి.సీతామహాలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులకండం సత్యవేణి, ఎంఎస్‌కే శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏనుగువానిలంకలో..

యలమంచిలి: యువతులంతా సెల్ ఫోన్ వినియోగించే సమయంలో సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా కోరారు. ఏనుగువానిలంక అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కిశోర వికాసం సమ్మర్ హాలిడే స్పెషల్ క్యాంప్‌లో సైబర్ నేరాలు గురించి ఆమె యువతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం టి.సంధ్య, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.లక్ష్మీ సాయి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతోఅప్రమత్తంగా ఉండాలి

పెనుగొండ: సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.కృష్ణ కుమారి అన్నారు. మంగళవారం పెనుగొండ మండలం మల్లప్ప దిబ్బలో కిశోరి వికాసం సమ్మర్ క్లాస్‌లో పాల్గొన్నారు. నెట్‌లో చాట్ చేస్తున్నపుడు చిరునామా, ఫోన్, ఆధార్ నంబర్లు, వ్యక్తిగత వివరాలు అపరిచితులకు షేర్ చేయకూడదన్నారు. చెడుపదార్థాలను ఉపయోగించకూడదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.సుజాత, అంగన్‌వాడీ కార్యకర్త ఎం.లలిత పాల్గొన్నారు.

పాలమూరులో..

పెనుమంట్ర: విద్యార్థులు విద్యా అవసరాలకు మాత్రమే సెల్‌ఫోన్‌ను వినియోగించుకోవాలని వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తే అనేక చిక్కుల్లో పడతారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎస్.వెంకటలక్ష్మి, టి.పోచమ్మ, పి.వరలక్ష్మి అన్నారు. కిశోర వికాస వేసవి శిక్షణ తరగతులలో భాగంగా మంగళవారం మండలంలోని పాలమూరు, ఓడూరు, సత్త రామేశ్వరం గ్రామాల్లో కిషోర్ బాలికలకు సైబర్ నేరాలు, ఆన్లైన్ భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



పాలకొల్లు సెంట్రల్: సమావేశంలో మాట్లాడుతున్న మార్‌లింగం



యలమంచిలి: ఏనుగువానిలంకలో మాట్లాడుతున్న మహ్మద్ హసీనా



పెనుగొండ: మల్లప్పదిబ్బలో కిశోర వికాసం కార్యక్రమానికి హాజరైన బాలికలు



పెనుమంట్ర: పాలమూరులో అవగాహన కల్పిస్తున్న పి.వరలక్ష్మి

సీపీఎం ఆధ్వర్యంలో దేశ సమైక్యతా యాత్ర

యలమంచిలి: పహల్గాంలో పాకిస్తాన్ ముష్కరుల ఉగ్రదాడి తరువాత భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో మంగళవారం సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో దేశ సమైక్యత ర్యాలీ నిర్వహించారు. మండలంలోని కలగంపూడి గ్రామంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ప్రారంభమైన దేశ సమైక్యత యాత్ర ర్యాలీ సుమారు మూడు కిలోమీటర్ల మేర సాగి చించినాడ బ్రిడ్జి వద్ద ముగిసింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు బాతిరెడ్డి జార్జి, మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ పహల్గాంలో ఏప్రిల్ 22న 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు బలిగొన్నారని, అనంతరం భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్తాన్‌లోని ఉద్రవాద స్థావరాలను ధ్వంసం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాసవరపు సుబ్బారావు, సరిపల్లి జయప్రభ, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, దేవ సుధాకర్, గుబ్బల చక్రపాణి, గూడూరు ఆంజనేయులు, మల్లుల పుల్లారావు, చింతపల్లి కొండ, మల్లుల కోటి, అంబటి రంగనాయకులు, గూడూరు నాగేశ్వరరావు, శెట్టిమి భాస్కరరావు పాల్గొన్నారు.



దేశ సమైక్యత యాత్ర ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

డీఎస్సీలో జిల్లాస్థాయి స్పోర్ట్స్ కోటా అమలు చేయాలి

భీమవరం: ప్రస్తుత డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో సీనియర్ స్టేట్‌లెవల్ క్రీడాకారులకు మాత్రమే దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంతో అనేక మంది జిల్లాస్థాయి అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని విజ్ఞాన వేదిక కన్వీనర్ అల్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్పోర్ట్స్ అభ్యర్థులకు జిల్లాస్థాయి నుంచి స్పోర్ట్స్ సర్టిఫికెట్స్‌తో డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వగా ప్రస్తుత డీఎస్సీకి కేవలం సీనియర్ స్టేట్ లెవల్ అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 421 స్పోర్ట్స్ కోటా పోస్టులను భర్తీ చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని అందువల్లే సీనియర్ స్టేట్ లెవల్ స్థాయిని నిర్ణయించారని విమర్శించారు. ఈ నెల 31వ తేదితో దరఖాస్తు గడువు ముగుస్తున్నందున ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లాస్థాయి సర్టిఫికెట్స్ పొందిన డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

యానాం మద్యం స్వాధీనం

పెనుగొండ: మండలంలోని దొంగరావిలెం వద్ద అక్రమంగా యానాం మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, 96 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ పక్కా సమాచారంతో వాహనాలు తనిఖీ చేయగా నిందితుడు పట్టుబడినట్లు వివరించారు. కేంద్ర పాలిత యానాం నుంచి ఇరగవరం మండలం కంతేరుకు చెందిన కొవ్వూరి వెంకట శ్రీనివాస రెడ్డి, తాడేపల్లిగూడేనికి చెందినగుత్తులశ్రీనివాసరావుకు ఈ మద్యం సరఫరా చేయడానికి తీసుకువస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. యానాంలోని లక్ష్మీ వైన్స్ నుంచి కాపగంటి సుమన్ మద్యాన్ని శ్రీనివాస రెడ్డికి విక్రయించినట్లు విచారణలో తేలిందన్నారు. దీంతో శ్రీనివాసరెడ్డిని, గుత్తుల శ్రీనివాసరావులను అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద నుంచి రూ.25 వేలు విలువ చేసే 66 లీటర్ల మద్యం , రూ.లక్ష విలువ చేసే కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు ఆర్.మధుబాబు, బి.లక్ష్మీ, హెచ్‌సీ కె.శ్రీనివాసరావు, వైశ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



దొంగరావి పాలెం వద్ద యానాం మద్యంతో పట్టుబడ్డ వ్యక్తి